క్లుప్తంగా

హామీల అమలులో నిర్లక్ష్యం



నర్సంపేట : ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు కలకోట అనిల్ అన్నారు. బుధవారం పట్టణంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచుతామని మోసం చేశారన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు ఫరీద, విజయ, స్వప్న, నాగమణి, జగన్నాథం, కార్తీక్, విలియంకేరీ పాల్గొన్నారు.

ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

నర్సంపేట: పట్టణంలోని ఆర్టీసీ కార్యాలయంలో ఉద్యోగులకు బుధవారం డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆరోగ్యంగా ఉండేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ భవాని సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి



నర్సంపేట : పట్టణంలోని మహబూబాబాద్ రోడ్‌లో సర్వే నంబర్ 121లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను నిలిపివేయాలని భూపోరాట కమిటీ బాధ్యులు ప్రకాశ్, సదానందం, విజయ్‌లు కోరారు. ఈ మేరకు నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ బుధవారం కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు మౌనం పాటించడం సరికాదన్నారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు దగ్గరుండి మరీ నిర్మాణాలు చేయించడం ఏంటని ప్రశ్నించారు. కమిటీ బాధ్యులు రాజు, స్వామి, శ్రీను, రవితేజ, ప్రభాకర్, రమేష్, ఇసాక్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం

వర్ధన్నపేట : రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం చేశారని బడ్జెట్‌లో నిధుల తగ్గింపుపై బీసీ ఐక్య వేదిక మండిపడింది. బుధవారం వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో బీసీ ఐక్య వేదిక నాయకుడు శివ మాట్లాడుతూ జనాభాలో 56.39 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో భిక్ష వేసినట్లు కేవలం రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించడం బీసీల గొంతు కోసినట్లేనన్నారు. బీసీ సంక్షేమానికి అరకొర నిధుల బడ్జెట్ ఏంటని ప్రశ్నించారు. సామాజిక న్యాయం ప్రకారం మనకు సగం వాటా దక్కాల్సిందేనన్నారు.

ఎంఈఓకు సన్మానం



నల్లబెల్లి: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ అనురాధను పీఆర్టీయూ బాధ్యులు బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్రీనాథ్, వెంకట్రాంనర్సయ్య, రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



నర్సంపేట రూరల్ : దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ సారయ్య అన్నారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగత్వం కలిగిన పిల్లలు భయాందోళకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తుందన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్

వర్ధన్నపేట : బీసీలకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అసెంబ్లీలో ఆమోదం తెలపడం హర్షనీయమని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ నేషనల్ జాయింట్ కోఆర్డినేటర్ ఉల్లెంగల యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. రాహుల్‌గాంధీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేశారన్నారు.

ఉపాధి హామీలో షెడ్ల మంజూరు

- పశువులు, గొర్రెలు, కోళ్ల పాకలకు నిధులు
- గ్రామాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులు
- ఈనెల 31వరకు పూర్తిచేసేందుకు అధికారుల కసరత్తు

నల్లబెల్లి: గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగంగా ఉండేందుకు షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గొర్రెలు, పశువులకు నీడ కల్పించేందుకు, కోళ్ల పరిశ్రమను ప్రోత్సహించేందుకు షెడ్ల (పాకలు)ను మంజూరు చేసి పనులు ప్రారంభించింది.

మూడు రకాల షెడ్లు..

రైతుల ప్రయోజనాల మేరకు మూడు రకాల షెడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 15 ఫీట్ల పొడవు, 12 ఫీట్ల వెడల్పు గల ఒక్కో పశువుల పాకకు రూ.99 వేలు, 15 ఫీట్ల పొడవు, 13 ఫీట్ల వెడల్పు గల ఒక్కో గొర్రెల పాకకు రూ.1.30 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. 55 ఫీట్ల పొడవు, 18 ఫీట్ల వెడల్పుతో వెయ్యి కోడి పిల్లలు పెంచేందుకు ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.99 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈనెల 31లోగా షెడ్ల నిర్మాణాల పనులు పూర్తిచేయాల్సి ఉంది.



మేడపల్లిలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్డు

మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం, మంజూరైనవి, పనులు ప్రారంభమైన షెడ్ల వివరాలు..

మండలం	షెడ్ల లక్ష్యం	మంజూరు	ప్రారంభమైనవి
నర్సంపేట	10	10	6
గీసుకొండ	10	6	4
పర్వతగిరి	10	10	2
ఖానాపురం	10	10	5
నల్లబెల్లి	10	10	4
వర్ధన్నపేట	10	10	2
చెన్నారావుపేట	10	10	4
దుగ్గొండి	10	6	3
నెక్కొండ	10	6	3
సంగెం	10	10	3
రాయపర్తి	10	10	8
మొత్తం	110	98	44

44 షెడ్ల పనులు ప్రారంభం

జిల్లాలో ప్రతి మండలానికి కనీసం 10 గొర్రెలు, పశువుల షెడ్లు, మండలానికి ఒకటి చొప్పున కోళ్ల షెడ్డు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మేరకు అధికారులు జిల్లాలోని 11 మండలాల్లో 110 గొర్రెలు, పశువుల షెడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆయా మండలాల్లో 98 షెడ్లు మంజూరు చేయగా 44 షెడ్ల నిర్మాణ పనులు మాత్రమే ప్రారంభించారు.

మండలానికి ఒక కోళ్ల షెడ్డు..

జిల్లాలో 11 మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున 11 కోళ్ల షెడ్లు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా 10 మండలాల్లో మంజూరు ఇచ్చారు. కానీ, వర్ధన్నపేట మండలంలో ఒక చోట మాత్రమే పనులు ప్రారంభించారు. నిర్మాణాలు చేపడితే సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందో లేదోనని రైతులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

షెడ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి..



రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం గొర్రెలు, పశువులు, పౌల్ట్రీ షెడ్లను మంజూరు చేసింది. ప్రస్తుతం గ్రామాల్లో ఈ పనులు కొనసాగుతున్నాయి. వీటి ప్రయోజనాలు, బిల్లుల చెల్లింపుపై రైతులకు అవగాహన కల్పిస్తాం. సకాలంలో లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

- నర్సింహమూర్తి, ఎంపీడీఓ, నల్లబెల్లి

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రావొద్దు

- జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి

దుగ్గొండి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గుడ్డేలుగులపల్లి, గొడ్రియాతండా గ్రామాల్లోని బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో ఏఈలు రామ్మూర్తి, ప్రత్యూషకు సూచించారు. మరో 15 రోజుల తర్వాత వరి పంటలకు నీటి అవసరం ఉండదని, ఆ తర్వాత బావులను అద్దెకు తీసుకుని నల్లాల ద్వారా ఇంటింటికి నీరందించాలని ఆదేశించారు. ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏఈ మంగ్యానాయక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సంపేట : మంచినీరు, సాగునీటిపై సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ అన్నారు. చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, భగీరథ ఏఈ రణధీర్, పీఆర్ ఏఈ స్రృజన్, ఏఓ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..



దుగ్గొండి: గ్రామాల వారీగా సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి

సంగెం: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి రమేష్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. రామచంద్రాపురం, గవిచర్ల గ్రామాల్లో దేవాదుల నీరు రాకపోవడంతో 8 ఎకరాల్లో పంట ఎండిపోయినట్లు నివేదిక అందిందన్నారు. సంగెం మండల, ఐనవోలు మండలాల ఐబీ అధికారుల సమన్వయ లోపంతో పంటలు ఎండిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, ఏఓ యాకయ్య, హెచ్‌ఓ తిరుపతి, ఏఈలు పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్‌కు స్వాగతం



దుగ్గొండి: విజయ సంకేతం చూపుతూ సునితా విలియమ్స్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



గీసుకొండ : సునీతా విలియమ్స్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

దుగ్గొండి: అంతరిక్ష పరిశోధనల కోసం వెళ్లి సుదీర్ఘ కాలం అనంతరం భూమికి తిరిగివచ్చిన సునీతా విలియమ్స్‌కు మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయ సంకేతం చూపుతూ స్వాగతం పలికారు. గత ఏడాది జూన్ 5న అంతరిక్షంలోకి వెళ్లిన సునీత సాంకేతిక కారణాల వల్ల 9 నెలల పాటు ఎంతో ధైర్యంతో అంతరిక్షంలో గడిపారు. బుధవారం తెల్లవారుజామున భూమికి చేరుకోవడంతో స్థానిక కల్పనా చావ్లా సైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ సునీతావిలియమ్స్ సాహసం, ధైర్యం నేటి బాలికలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

గీసుకొండ: తొమ్మిది నెలలు అంతరిక్షంలో గడిపి బుధవారం తెల్లవారుజామున భూమికి సురక్షితంగా చేరిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా స్వాగతం పలికారు. ఉదయం పాఠశాల మైదానంలో ప్రత్యేకంగా తయారు చేసిన పోస్టర్లు, ప్లకార్డులను ఆకాశంవైపు చూపిస్తూ ఆమె రాకను స్వాగతించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పట్టాభి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు

వర్ధన్నపేట : ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని డీసీ తండా పరిధిలోని డీబీఎం 54 గేట్లను గుర్తు తెలియని వ్యక్తులు లేపి నీటి చౌర్యానికి పాల్పడినట్లు ఎస్సారెస్పీ ఏఈ బాలదాసు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బుధవారం సీఐ ఎస్సారెస్పీ పంట కాల్వ వద్దకు వచ్చి పరిశీలించారు. ఏఈ బాలదాసు మాట్లాడుతూ సిబ్బందిని గేట్ల వద్ద రాత్రి వేళ కాపలా ఉంచినప్పటికీ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, నీటి చౌర్యం చేయడం జరిగిందని సీఐకి వివరించారు. సీఐ మాట్లాడుతూ నీటి చౌర్యం చేయడం నేరమన్నారు. గేట్లు లేపిన వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందని చెప్పారు.



ఎస్సారెస్పీ కాల్వ వద్ద లేపిన గేట్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, అధికారులు

క్రైం కార్నర్

బ్యాగు అపహరణ



బాధితురాలితో కలిసి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు

నెక్కొండ : ఓ మహిళ బ్యాగు అపహరణకు గురైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో ని నాగారం గ్రామానికి చెందిన రజిత పని మీద వరంగల్‌కు వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి నెక్కొండలో దిగింది. అనంతరం నెక్కొండ బస్టాండ్‌కు చేరుకొని నాగారం వెళ్లేందుకు మరో బస్సు ఎక్కిన ఆమె తన వద్ద ఉన్న బ్యాగు లేకపోవడంతో అపహరణకు గురైందని గ్రహించి లబోదిబోమంది. దీంతో స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా వారి సీసీ కెమెరాలను పరిశీలించారు. వి చారణ చేస్తున్నామని వారు పేర్కొన్నారు. బాధితురాలు పీఎస్‌లో ఫిర్యాదు చేయలేదని వారు తెలిపారు. కాగా బ్యాగులో మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 1000 నగదు, గుర్తింపు కార్డులున్నాయని ఆమె చెప్పారు.

కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

సంగెం : మండలంలోని నర్సానగర్ గ్రామపంచాయతీ శివారు జాటోతు తండాకు చెందిన జాటోత్ వెంకట్రామ్‌ను అదే తండాకు లావుడ్య వెంకన్న కర్రతో దాడి చేయగా అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి వెంకట్రామ్ ఇంటి ముందున్న నీటితొట్టిలో ఎవరివో మేకలు నీరు తాగుతుండగా వాటిని బయటకు కొట్టుతుండగా వెంకన్న వచ్చి బూతులు తిడుతూ కర్రతో వెంకట్రామ్‌పై కొట్టగా కిందపడిపోయాడు. తన ఇంటి ఆవరణలోకి వచ్చి బూతులు తిట్టి , కర్రతో దాడి చేసిన వెంకన్నపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చదువుపై నిర్లక్ష్యం చేయొద్దు



నర్సంపేట : పరీక్ష సామగ్రిని అందజేస్తున్న కరుణ

నర్సంపేట : చదువుపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని భారతి మహిళా మండలి అధ్యక్షురాలు పెరుక కరుణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పెరుక ఉపేందర్ జ్ఞాపకార్థంగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో గుర్రపు అరుణ, నల్ల భారతి, గుడిపూడి అరుణ, దుర్గాభవాని, విజయలక్ష్మి, శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు

పరీక్ష సామగ్రి పంపిణీ

నర్సంపేట రూరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలని పాఠశాల చైర్‌పర్సన్ అల్లె ప్రియాంక అన్నారు. మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వపు గణిత ఉపాధ్యాయుడు మనోహర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలి

ఖానాపురం : విద్యార్థులు ఆలో చనా శక్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ పెరక సునీత అన్నారు. మండలంలోని బుధరావుపేట మోడల్‌స్కూల్‌లో బుధవారం ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకూడదని సూచించారు. విద్యార్థులు చేపట్టిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్థికసాయం

సంగెం : బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ భార్య పుష్ప అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మండలంలోని నార్లవాయిలో ఆయన స్వగృహంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి తరఫున శ్రీనివాస్‌కు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, ఉన్నారు.

పరామర్శ

నర్సంపేట : మండల కేంద్రానికి చెందిన దామెరుప్పుల వీరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధితురాలి కుటుంబాన్ని బీజేపీ నాయకుడు కంభంపాటి పుల్లారావు బుధవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు పంజాల రాము, మల్లయ్య, మహేందర్, పెద్ద శ్రీను, రాజ్‌కుమార్, చిరంజీవి, లక్ష్మినర్సయ్య, ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేయించాలి



ధర్నా చేపడుతున్న నాయకులు

నల్లబెల్లి : మల్టీపర్పస్ కార్మికులందరితో పారిశుద్ధ్య పనులు చేయించాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు నిబంధనలు పాటించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బొట్ల నరేష్, పాల్గొన్నారు.

విద్యార్థులు సమయానికి హాజరుకావాలి

- ఖానాపురం ఎంఈఓ శ్రీదేవి



ఖానాపురం : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీదేవి

ఖానాపురం : విద్యార్థులు పరీక్షల సమయానికి అరగంట ముందే హాజరుకావాలని ఎంఈఓ శ్రీదేవి సూచించారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 222 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. పరీక్ష సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దుగ్గొండి : ఈనెల 21 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 260 మంది విద్యార్థులు ఉండగా స్థానిక ఉన్నత పాఠశాల సెంటర్‌లో 140 మంది, మల్లంపల్లి సెంటర్‌లో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి

నర్సంపేట రూరల్ : విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ హమీద్ అన్నారు. మండలంలోని మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇంట్రాక్ట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యసన సామర్థ్యాలు సాధించాలంటే పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన జరగాలన్నారు. ఎంఈఓ సారయ్య, ఎండీ గౌస్‌పాషా, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అర్జున్‌సాగర్, పీఎస్ హెచ్‌ఎం సరితాబాయి పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్ కోసం కష్టపడాలి

పర్వతగిరి : విద్యార్థులు అనవసర విషయాలపై ఆసక్తి తగ్గించి భవిష్యత్ కేరీర్‌పై కష్టపడాలని ఎథికల్ కేరీర్ గైడెన్స్ సంస్థ చైర్మన్ గూడెల్లి శివప్రసాద్ అన్నారు. 2024–25 పదో తరగతి పరీక్షలు ఈ నెల 21 నుంచి పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు బుధవారం స్థానిక జెడ్పీఎస్ఎస్‌లో విజయోస్తు కార్యక్రమం నిర్వహించారు. ఇదే పాఠశాలలో చదువుకున్న శివప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యార్థులకు ఉచిత కేరీర్ గైడెన్స్ అందిస్తామన్నారు. అదే విధంగా పాఠశాలను దత్తత తీసుకుని ఈసీజీ అమలు చేస్తానన్నారు. ఎంఈఓ లింగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వల్ల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడుల పట్ల సానుకూల ప్రభావం పడుతుందన్నారు. అనంతరం గురుపాద స్తోత్రం, తల్లిదండ్రుల పాద పూజ నిర్వహించి విద్యార్థుల విజయాన్ని కాంక్షిస్తూ తల్లిదండ్రుల చేత హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం పాక రమేష్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

భయం లేకుండా పరీక్షలు రాయాలి



మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ అహ్మద్

సంగెం : పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎస్‌సీఆర్‌టీ ఫ్యాకల్టీ సయ్యద్ మతీన్ అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోళన లేకుండా అన్ని సబ్జెక్టులు సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు జవాబులు చెప్పడంతో అభినందించారు. ఆయన వెంట ఎంఈఓ రాము, ప్రత్యేకాధికారి నీలిమ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో బుధవారం ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్‌ల పెంపునకు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. బాణసంచాలు కాలుస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



నర్సంపేట : సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేటలో..



ఖానాపురంలో..



గీసుకొండలో..

వర్గీకరణ విజయం.. అమరులకు అంకితం



బాణసంచా కాల్చుతున్న ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు

దుగ్గొండి : మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితంగా సాధించిన ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన విజయం మాదిగ అమర వీరులకు అంకితం అని ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షుడు కొలగాని రవి అన్నారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు రవీందర్, సదానందం, యుగంధర్, భాస్కర్, రవి, తదితరులు పాల్గొన్నారు.